చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికాజశ్వాల్

వేములవాడ రూరల్, డిసెంబర్ 27 : చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధికాజశ్వాల్ పేర్కొన్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ శివారులోని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలను గౌరవించడంతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కేసులంటే లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం పలు అంశాలపై ఆమె వివరించారు. కౌన్సిలర్‌తో పాటు కాలనీవాసులున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తెలంగాణ చౌక్, డిసెంబర్ 27 : యువత మత్తుపదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని పట్టణ సీఐ కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్ మీ కోసం ప్రోగ్రాంలో భాగంగా అవగాహన కల్పించి, మాట్లాడారు. అనవసరపు ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేసి, తమకు వచ్చిన ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. ఫోన్‌కు వచ్చే లింకులు క్లిక్ చేసి, మోసపోవద్దని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలో సీసీ కెమెరాలు పెట్టుకొని దొంగతనాలను నివారించాలని పేర్కొన్నారు. కుల పంచాయితీలో డబ్బులు డిపాజిట్ పెట్టుకొని పంచాయతీలు చేసుకోవద్దని ఏలాంటి సమస్యలున్నా పోలీస్ స్టేషన్‌కు వచ్చి పరిష్కరం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరలున్నారు.

సీఎం గారు ఆలస్యమెందుకు?

- ముంపు గ్రామాల లబ్ధిదారులకు పత్రాలు ఇవ్వండి
- లేఖ ద్వారా కోరిన బీజేపీ నాయకుడు మహేశ్

వేములవాడ, డిసెంబర్ 27 : మధ్య మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని అంకెలతో ప్రకటించినందున వారికి వెంటనే పత్రాలు అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్ర మహేశ్ లేఖ ద్వారా సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. సీఎం రేవంత్ రెడ్డికి లేఖను రాసినట్లుగా మధ్య మానేరు ముంపు గ్రామాల సామాజిక మాధ్యమాల్లో ఎర్ర మహేశ్ లేఖ ప్రస్తుతం వైరల్‌గా మారింది. 4694 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసిన సీఎం కార్యాలయం ఎందుకు ఆలస్యం చేస్తున్నారు. వెంటనే మంజూరు పత్రాలు, నిర్మాణం కోసం రూ. 5 లక్షల నగుదు ఇవ్వాలన్నారు. తప్పిపోయిన కుటుంబాలకు ప్యాకేజీలు ఇవ్వడం, మిగిలిన నివాసాలకు పరిహారం ఇవ్వడం లాంటివి ఇంకెందుకూ ఆలస్యం తొందరగా ఇచ్చేయండి అంటూ లేఖలో పేర్కొన్నారు. సర్వస్వం కోల్పోయి ఉపాధి లేక నిర్వాసితులుగా మారిన ఈ ప్రాంత యువతకు ఇండస్ట్రియల్ కారిడారిగా ప్రకటించి ఉపాధి కల్పించాలని కూడా లేఖలో పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ త్వరగా పత్రాలు, పరిహారం అందించాలని లేఖలో కోరడం ప్రస్తుతం ముంపు గ్రామాల్లో వైరల్‌గా మారింది.

తుర్కపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ముస్తాబాద్, డిసెంబర్ 27 : మండలంలోని తుర్కపల్లి గ్రామంలో అశ్విని దవాఖాన ఎల్లారెడ్డిపేట వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంపై మాజీ సర్పంచ్ కాశోల్ల పద్మ, దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి 88 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. హాజరై వారికి రక్త పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసినట్లు అశ్విని దవాఖాన మేనేజింగ్ డైరెక్టర్ అభినయ్ తెలిపారు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

PLOT FOR SALE

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

రాజన్న కోడెలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- గోశాల ఆకస్మిక తనిఖీ

జిల్లా పశుసంవర్ధక అధికారి రవీందర్ రెడ్డి, ఈవో వినోద్ రెడ్డితో కలిసి గోశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

వేములవాడ టౌన్, డిసెంబర్ 27 : రాజన్న ఆలయ గోశాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గోశాలలోని పరిసరాలను పరిశీలించి, జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోశాలలో కోడెల కోసం చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కోడెల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని దాన, గడ్డి ఇతర విషయాల్లోనూ జాగ్రత్త వహించాలని ఆదేశించారు. వాటి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కూడా అధికారులను సూచించారు. ఆయన వెంట జిల్లా పశుసంవర్ధక అధికారి రవీందర్ రెడ్డి, రాజన్న ఆలయ ఈవో వినోద్ రెడ్డి, ఈఈ రాజేశ్, ఏఈవో శ్రవణ్ కుమార్, డీఈ రఘునందన్, పర్యవేక్షకుడు వరి నర్సయ్య, ఏఈ నాగరాజు, పరమేశ్, గొట్టం రవి ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లా అధ్యక్షుడు నర్సయ్య

సిరిసిల్ల రూరల్: నిరసన తెలుపుతున్న కార్మికులు

చందుర్తి, డిసెంబర్ 27 : చాలీచాలని వేతనాలతో గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు మల్యాల నర్సయ్య పేర్కొన్నారు. జిల్లా కమిటీ పిలుపుమేరకు టోకెన్ సమ్మే కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలో పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్యాల నర్సయ్య మాట్లాడుతూ పదేళ్లుగా ప్రభుత్వాలు మారిన తమ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఏడాది పాలన పూర్తి చేసుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. కార్మికుల సమస్యలను పరిష్కరించి పనికి తగిన వేతనాన్ని అందజేయాలన్నారు. అర్హత కలిగిన కారోబార్లను పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతామన్నారు. కార్మికుల ఉన్నారు.

గంభీరావుపేట, డిసెంబర్ 27 : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం మండల పంచాయతీ కార్మికులు, సిబ్బంది సమ్మేలో పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కారించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సమ్మేలో నినాదాలు చేశారు.

వీర్నపల్లి, డిసెంబర్ 27: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లారపు అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు లద్దురి నర్సయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అరుణ్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. 51 జీవోను రద్దు చేయాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్‌లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలన్నారు. 60 జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని తెలిపారు. రేపు సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన కలెక్టర్ కార్యాలయం ముట్టడికి పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గురువారం మృతి చెందిన మాజీ ప్రధాని మంత్రి మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు న్యాత నర్సయ్య, గుర్రపు సురేశ్, నగేశ్, శ్రీనివాస్, రమేశ్, నర్శవ్వ, లక్ష్మణ్, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 27 : తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయం వెనుక జీపీ కార్మికులు ధర్నా చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ తంగళ్లపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు, కార్మిక సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

సంఘ సభ్యుల సంక్షేమమే లక్ష్యం

మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ రాజేశంగౌడ్

ముస్తాబాద్, డిసెంబర్ 27 : పాలకవర్గం సభ్యులతో పాటు సహకార సంఘం ఖాతాదారుల సహకారంతో సంఘం అభివృద్ధి పథంలో ముందు వరుసలో నిలిచిందని ఇన్‌చార్జి చైర్మన్ మెరుగు రాజేశం గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం పాలకవర్గం సమాశం అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నష్టాల్లో ఉన్నా సహకార సంఘం చైర్మన్‌గా తన్నీరు బాపురావు బాధ్యతలు తీసుకొని, తర్వాత పాలక వర్గం సభ్యుల సహకారంతో అంచలంచలుగా నష్టాలను పూడ్చుతూ నేడు సుమారు రూ. 28.5 కోట్ల టర్నవర్‌తో ముందుకు సాగుతోందన్నారు. పోతుగల్‌లో అధునాతన సహకార సంఘం భవనం, సంఘం పరిధిలోని గ్రామాల్లో రైతులకు ఎరువుల విక్రయ గోదాములు, రెండు పెట్రోల్, డిజిల్ పంపులు, గూడెంలో కమర్షిల్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషకరమన్నారు. సంఘం ద్వారా రూ. 12,48,36,342 స్వల్పకాలిక రుణాలు. రూ. 13,66,54,285 దీర్ఘకాలిక రుణాలు రూ.1,40,28,312 బంగారం రుణాలు. రూ. 8,58,921 చిరువ్యాపార రుణాలు. రూ. 5,77,429 వ్యక్తి గత రుణాలు. రూ.12,63,521, వాహన రుణాలు రూ. 53,79,668 మార్టగేజ్ రుణాలు అందించామన్నారు.

ఈ సీజన్లో ధాన్యం కొనుగోళ్లు 1,14,300 క్వింటాళ్లు

పాలకవర్గం సిబ్బంది రైతుల సహకారంతో ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా ధాన్యం సేకరించినట్లు ఆయన తెలిపారు. డైరెక్టర్లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సరైన పుస్తకాలు సమకూర్చాలి

గంభీరావుపేట, డిసెంబర్ 27 : మండలంలోని కొత్తపల్లి గ్రంథాలయంలో నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలను సమకూర్చాలని శుక్రవారం గ్రామస్తులు, నేతలు కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగు ల సత్యనారాయణ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, డైలీ న్యూస్ పేపర్‌ను సమకూర్చాలని వారు కోరారు. అదే విధంగా గ్రంథాలయ పర్యవేక్షణకు ఒకరిని నియమించాలన్నారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, నేతలు రాజనర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆజాం, మహేశ్ గౌడ్, విఠల్ ఉన్నారు.

దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయింది

రుద్రంగి : మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, నాయకులు

వేములవాడ, డిసెంబర్ 27 : సామాన్య కుటుంబంలో జన్మించి గొప్ప ఆర్థికవేత్తగా ఎదిగి దేశ చరిత్రలో ముఖ్యుడిగా నిలిచిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం తీరనిలోటని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు అన్నారు. దేశ ప్రధానిగా పీవీ నరసింహారావు ఉన్న సమయంలో ఆర్థిక మంత్రిగా కొనసాగిన మన్మోహన్ సింగ్, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి చరిత్రలో ముఖ్యుడిగా నిలిచారని గుర్తుజేశారు. దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆయన చేసిన సేవలు ఎప్పటికీ నిలిచిపోతాయన్నారు. ఆయన మృతిపై సంతాపాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు : ప్రభుత్వ విప్

వేములవాడ/ రుద్రంగి, డిసెంబర్ 27: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ, రుద్రంగి మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నాయకులతో కలిసి ఆది శ్రీనివాస్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన మహా ఆర్థిక మేధావి మన్మోహన్‌సింగ్ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నాయకులు సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్, తర్రె మనోహర్, అభిలాష్, యాదయ్య, నర్సరెడ్డి, లచ్చిరెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, ఇప్ప మహేశ్, శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

18వ రోజు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

కలెక్టరేట్, డిసెంబర్ 27: మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్‌కు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఘన నివాళులర్పించారు. ఈ మేరకు శుక్రవారం రాజన్నసిరిసిల్ల జిల్లాలోని సమగ్ర శిక్షా ఉద్యోగులు 8వ రోజు సమ్మేలో భాగంగా గురువారం మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణానికి సిరిసిల్లలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఆయన ఫొటోకి దండలు వేసి, నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించారు. జిల్లాలోని అన్ని విభాగాల సమగ్ర శిక్ష ఉద్యోగులు దాదాపు 300 మంది పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 27: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై మండలంలోని పలు పార్టీ నాయకులు నివాళులర్పించారు. మండలంలోని శుభోదయ పాఠశాలలో మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద విద్యార్థులు నివాళులర్పించారు. పార్టీల నాయకులు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

ముస్తాబాద్, డిసెంబర్ 27: భారత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల మండల కేంద్రంలో అన్ని సబ్బండ వర్గాల ప్రజలు వివిధ పార్టీల నాయకులు ఆయన చిత్ర పటాలు ఏర్పాటు చేసి, నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులతో కార్మికులు నివాళులర్పించారు.

ఎల్లారెడ్డిపేటలో టోకెన్ సమ్మెచేస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికులను గుర్తించాలి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 27 : గ్రామాల స్వచ్ఛతకు పారిశుధ్య కార్మికులు అందించే సేవలను గుర్తించి వారందరినీ క్రమ బద్ధీకరించాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పారిశుధ్య కార్మికులు టోకెన్ సమ్మె పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వమే పారిశుధ్య కార్మికుల ఖాతాలో వేతానాలు వేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు వెలిగేటి రాజశేఖర్, మండలాధ్యక్షుడు నరపురం నర్సయ్య, ఉపాధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రేసు కిషన్, పండుగు భారతి, బాయికాడి చిన్నలక్ష్మి, పసుల ఎల్లయ్య, చింతల భిక్షపతి, సాలి అనసూయ, కర్రె ఎల్లవ్వ, అనసూయ, దేవయ్య, లక్ష్మి, గోవర్ధన్ పాల్గొన్నారు.

యువకుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

చందుర్తి, డిసెంబర్ 27 : మండలంలోని నర్సింగాపూర్‌లో పెరుక లస్మయ్య ఇంటి కిటికీని తవ్వి చోరీకి యత్నించిన మెదక్ జిల్లా కేంద్రంలోని అజంపూర్ గల్లీకి చెందిన ఓల్లపు గణేశ్ అనే యువకుడిని గ్రామస్తులు శుక్రవారం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలో ప్లాస్టిక్, ఇనుప వస్తువులు సేకరించే కుటుంబానికి చెందిన వ్యక్తులు గ్రామంలో ప్లాస్టిక్ సామగ్రిని వీధుల్లో సేకరిస్తున్నారు. వారిలో గణేశ్ అనే యువకుడు పీ లక్ష్మయ్య ఇంటి కిటికీని తవ్వి తీసుకెళ్లేందుకు యత్నించగా, గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి

కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సంఘం నాయకులు

వేములవాడ, డిసెంబర్ 27 : బీసీలు ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా కూడా ఎదగాలని కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సాధికారిత సంఘం గౌరవ అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. శుక్రవారం వేముల వాడలో ఉత్తర తెలంగాణ జిల్లాల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు చేసిన వాగ్దానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలన్నారు. బీసీ జనాభా ప్రతిపాదికపై అన్ని ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. రాజన్న క్షేత్రంగా ఇతర తెలంగాణ జిల్లాల కార్యాలయాన్ని ప్రారంభించు కోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సాధికారిత అధ్యక్షుడు పొలాస నరేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర రావు, జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు బొప్ప దేవయ్య, సినీ నటుడు కిరణ్, చలపతిరావు, గంగుల అంజలి యాదవ్, వాసు, అజయ్, రత్నాకర్, గాజుల బాలయ్య, మారం కుమార్, కూరగాయల కొమరయ్య, కొండా కనకయ్య ఉన్నారు.

కాంగ్రెస్ నేత.. మళ్లీ పైసా వసూల్?

- గతంలో కల్యాణలక్ష్మి పేరిట వసూలు!
- తాజాగా పోలీసుల పేరిట..?
- మండలంలో చర్చనీయాంశం

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 27: తంగళ్లపల్లి మండలంలోని ఓ కాంగ్రెస్ నాయకుడు మళ్లీ వసూళ్లకు దిగినట్టు తెలుస్తున్నది. గతంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ పేరిట డబ్బులు గుంజిన సదరు నేత, ఇప్పుడు ఏకంగా పోలీసుల పేరిటే వసూళ్లకు తెగబడడం విమర్శలకు తావిస్తున్నది. ఠాణాకు వచ్చిన ప్రేమికులను పోలీసులు అడుగుతున్నారంటూ డబ్బులు డిమాండ్ చేసినట్టు తెలుస్తుండగా, ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. మండలంలోని ఓ ప్రేమ జంట పెళ్లి చేసుకొని పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. తర్వాత కాంగ్రెస్ నాయకుడు పోలీసులతో మాట్లాడుతానని, ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని ప్రేమజంటను డిమాండ్ చేశాడు. దీంతో అబ్బాయి స్నేహితులు ఆ నాయకుడిని పోలీస్ స్టేషన్ ఆవరణలోనే నిలదీసి, పోలీసులు డబ్బులు ఎందుకు అడుగుతారని ప్రశ్నించారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొనడం, చుట్టు పక్కల వారు జమ కావడంతో ఆ నాయకుడు అక్కడి నుంచి పరారైనట్టు తెలిసింది. ఇటీవల ఓ గ్రామానికి బాలుడు ఓ వృద్ధురాలని బైక్‌తో ఢీకొట్టగా, అప్పుడు కూడా ఓ కౌన్సిలర్‌తో కలిసి కథ నడిపించినట్టు తెలిసింది. గతంలో కూడా సదరు కాంగ్రెస్ నాయకుడు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్న విషయం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇంత జరుగుతున్నా ఎలాంటి చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తున్నది. అయితే పెద్దల అండదండలు ఉండడంతోనే ఆ నాయకుడు రెచ్చిపోతున్నాడనే ప్రచారం జరుగుతున్నది. ఇదిలా ఉండగా ఈ ఘటనపై ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచి పోలీసులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ

రుద్రంగి, డిసెంబర్ 27 : మండలకేంద్రంలో పలువురు బాధిత కుటుంబాలకు వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చెర్మన్ కంటెరెడ్డి తండ్రి రాములు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి కుటుంబాన్ని, ఆనారోగ్యంతో మరణించిన బీఆర్ఎస్ నాయకుడు ఒద్యారపు మోహన్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, నాయకులు గంగం మహేశ్, చెప్యాల గణేశ్, నర్సింగ్, నారాయణ, కే శ్యాం, ఆకుల గంగారాం, బాబా, మల్లేశం, సింగారపు గంగారెడ్డి, నవీన్, మహేశ్, మణిదీప్, గంగాధర్ పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు ఎంపికైన గిరిజన విద్యార్థి

విద్యార్థిని సునిత

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 27: ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ వేడుకలకు గిరిజన విద్యార్థిని ఎంపికైంది. జిల్లాలోని తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన జే సునీత విద్యార్థి ఎంపికైంది. ఈ సందర్భంగా సునీతను ప్రిన్సిపాల్ రెహనా ఇప్పత్, ఎన్సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ డేనియల్ లాట్‌జం, కళాశాల అధ్యాపకులు విద్యార్థినిని అభినందనించారు.

దుకాణంలో చోరీ..

చోరికి పాల్పడుతుండగా సీసీ కెమెరాలో చిక్కిన అనుమానితుడు

వేములవాడ, డిసెంబర్ 27: వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ వీధిలోని రంగు మల్లేశం దుకాణంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. అయితే ఉదయం దుకాణం తీసేందుకు వచ్చిన మల్లేశం పరిసరాలను గమనించి, సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. రాత్రి సమయంలో పరదా జరుపుకొని లోపటికి వచ్చి దుకాణంలోని వస్తువులతో పాటు రూ. 5 వేల నగదు అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు అనుమానితుడు వచ్చి వెళ్లిన కదలికలని సీసీ కెమెరాలు రికార్డు అయిన వాటిని పోలీసులకు అందించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రించే అవకాశం ఉంటుందని ఇప్పటికైనా వ్యాపారులు గమనించి ప్రతి ఒక్కరు సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సిఐ వీరప్రసాద్ తెలిపారు.

వికటించిందా.. విషమించిందా?